# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల నిధులను ఇచ్చిందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పురుద్ఘాటించారు.**

**2.** **ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎన్నికల ప్రచారం ఈ రోజుతో ముగుస్తుంది.**

**3.** **ఈ రోజు సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు నిశ్శబ్ద కాలం అమల్లోకి వస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్ లో సంక్షేమ పథకాల నిధులను ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు లబ్ధిదారులకు జమచేయవద్దని ప్రభుత్వాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.**

**5.** **ఎన్నికల పోలింగ్ దృష్ట్యా తెలుగు రాష్ట్రాల్లోని ప్రయాణికుల కోసం అదనపు బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వెల్లడించింది.**

==========================

తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, గత పదేళ్లలో రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల నిధులను ఇచ్చిందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణపేట, హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలలో నిర్వహించిన బహిరంగ సభల్లో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ, పదేళ్లలో దేశం ఎంతో ప్రగతి సాధించిందని, ఇప్పుడు జరిగే ఎన్నికలు దేశ భవిష్యత్తుని నిర్ణయిస్తాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం ఎయిమ్స్, నాలుగు వందే భారత్ రైళ్లు, గిరిజన విశ్వవిద్యాలయం, పసుపు బోర్డు, రామగుండం ఎరువుల పరిశ్రమ, ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం వంటివి మంజూరు చేసిందని పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో లోక్ సభ, శాసనసభ, తెలంగాణలో లోక్ సభ ఎన్నికల ప్రచారం ఈ రోజుతో ముగుస్తుంది. సార్వత్రిక ఎన్నికల నాలుగో దశలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని 25 లోక్సభ నియోజకవర్గాలకు, 175 శాసనసభ నియోజకవర్గాలకు, తెలంగాణలోని 17 లోక్సభ నియోజకవర్గాలకు ఈ నెల 13న పోలింగ్ జరగనుంది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు, సమస్యాత్మక ప్రాంతాలలో సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ జరగనుంది.

---------------------------

ఈనెల 13న న సార్వత్రిక ఎన్నికలు  జరుగనున్న నేపథ్యంలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్  ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా  తెలిపారు.  అన్ని జిల్లాల ఎన్నికల యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం చివరి 72 గంటలలో  పోలింగ్ రోజును చేయాల్సిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఒక ప్రకటనలో వివరించారు. హింసకు, రీపోలింగ్‌కు తావు లేకుండా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల డీఈవో లకు, ఎస్పీలకు ఆదేశాలు జారీచేశారు. ఈ రోజు సాయంత్రం 6 గంటల నుండి  పోల్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుండి నిశ్శబ్ద కాలం అమల్లోకి వస్తుందని తెలిపారు. దీంతో ఎన్నికల ప్రచారం ముగుస్తుందన్నారు. ఈ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుందని,  ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరూ ఉల్లంఘించకూడదని తెలిపారు.

---------------------------

మే 13న జరగనున్న పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని  హైదరాబాద్  జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో ఆయన  పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారం ఈ రోజు సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందన్నారు. ఎన్నికల అధికారుల అనుమతులు తీసుకున్న తర్వాత మాత్రమే ప్రకటనలు ప్రచురించాలని తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఫిర్యాదులు చేయొచ్చన్నారు.  వీటిని తక్షణమే పరిష్కరిస్తామన్నారు . హైదరాబాద్ జిల్లా పరిధిలో 383 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను  గుర్తించామని, ఈ పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర సాయుధ బలగాల సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశామని చెప్పారు.

---------------------------

ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో  పోలింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఏజెంట్ల నియామకం లిస్టును రిటర్నింగ్ అధికారికి ఇవ్వాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం పేర్కొంది. పోలింగ్ తేదీ రోజు ప్రిసైడింగ్ అధికారికి పోలింగ్ ఏజెంట్లు తమ వివరాలను ఇవ్వాలని తెలిపింది. ఏజెంట్లను అభ్యర్థి ధృవీకరించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం  స్పష్టం చేసింది. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి సమక్షంలో పోలింగ్ ఏజెంట్ల నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని  పేర్కొంది.

---------------------------

సూపర్ సిక్స్ పేరుతో రూపొందించిన సంక్షేమ ప్రణాళికతో ప్రజలందరికీ మేలు చేస్తానని తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా  కృష్ణా జిల్లా గన్నవరంలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే  భూ హక్కు చట్టాన్ని  రద్దు చేస్తామని చెప్పారు.

---------------------------

కాంగ్రెస్ నాయకులు  రాహుల్ గాంధీ ఈ రోజు ఆంధ్రప్రదేశ్ లోని కడపలో పర్యటిస్తారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు, కడప పార్లమెంటు అభ్యర్థి వైఎస్ షర్మిల తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. తొలుత కడప విమానాశ్రయం

చేరుకుని అక్కడి నుంచి షర్మిలతో కలిసి హెలికాప్టర్లో ఇడుపులపాయకు వెళ్ళి, అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళు లర్పిస్తారు. తిరిగి కడపకు చేరుకుని నగరంలో నిర్వహించే బహిరంగసభలో ప్రసంగిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు జెపి నడ్డా ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తారని ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. పర్యటనలో భాగంగా ఈ ఉదయం తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం తిరుపతిలోని బాలాజీ కాలనీ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు నిర్వహించే రోడ్ షోలో పాల్గొంటారు. మధ్యాహ్నం కర్నూలు జిల్లా ఆదోనీలోని స్థానిక మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు పెట్టుబడి రాయితీ , విద్యా దీవెన, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం పథకాలకు సంబందించిన నిధులను ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు లబ్ధిదారులకు జమచేయవద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. నిధుల పంపిణీ అంశంపై ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయవద్దని స్పష్టం చేసింది.

---------------------------

ఎన్నికల పోలింగ్ దృష్ట్యా హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం 160 అదనపు బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ – టిఎస్ ఆర్టీసి వెల్లడించింది. అలాగే తెలంగాణలోని వివిధ జిల్లాలకు వెయ్యికి పైగా బస్సులను సిద్ధం చేశామని, మూడు రోజుల పాటు మొత్తం 14 వందల సర్వీసులు అందుబాటులో ఉంటాయని టిఎస్ ఆర్టీసి పేర్కొంది. హైదారాబాద్‌లోని ఎంజిబిఎస్, జెబిఎస్ లతో పాటు ఆరాంఘర్, ఉప్పల్, ఎల్బీ నగర్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరతాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అలాగే పోలింగ్ తర్వాత 13,14 తేదిల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి హైదారాబాద్‌కు తిరిగి వచ్చేందుకు కూడా బస్సులను సిద్ధం చేసినట్లు టీఎస్ ఆర్టీసీ తెలిపింది.

---------------------------

ఈరోజు జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో భారతదేశం సాధించిన పురోగతిని, మనదేశ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు సాధించిన విజయాలను గుర్తుచేసుకోవడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1999వ సంవత్సరం నుండి ప్రతి ఏటా మే 11వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. 1998 మే 11వ తేదీన రాజస్థాన్ రాష్ట్రంలోని పోఖ్రాన్‌లో భారతదేశం అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల విధులో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో 4 లక్షల 44 వేల 218 పోస్టల్ బ్యాలెట్ పోలైనట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ నెల 5న ప్రారంభమై 9న ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ఉద్యోగులు తమ ఓటు

హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ముగింపు రోజైన 9 వ తేదీన న పార్లమెంటు నియోజకవర్గాలకు 11 వేల 374 ఓట్లు, అసెంబ్లీ నియోజక వర్గాలకు 11 వేల 370 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. పార్లమెంటరీ నియోజక వర్గాల వారీగా అత్యధికంగా నెల్లూరు నియోజక వర్గంలో 22 వేల 650 పోస్టల్ బ్యాలెట్ పోల్ అవ్వగా, అత్యల్పంగా అమలాపురం నియోజక వర్గంలో 14 వేల 526 ఓట్లు పోల్ అయ్యాయని తెలిపారు.

---------------------------

మంచి భవిష్యత్తు కావాలంటే ఇండియా కూటమిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే పిలుపునిచ్చారు. విజయవాడ నగరంలోని జింఖానా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిన్న బహిరంగసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి జరగాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హెూదా రావాలని అన్నారు. ప్రత్యేకహెూదా ఇచ్చి ప్రోత్సాహకాలు ఇస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వైసీపీ, టిడిపి ప్రకటించిన మ్యానిఫెస్టోలో ప్రత్యేకహెూదా, ఉమ్మడి ఆస్తుల ప్రస్తావనే లేదని విమర్శించారు. మరోవైపు తెలంగాణ భువనగిరి లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని నకిరేకల్లో నిన్న జరిగిన కాంగ్రెస్ పార్టీ జనజాతర సభలోనూ మల్లిఖార్జున ఖర్గే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 6 గ్యారంటీల్లో ఇప్పటికే 4 హామీలను అమలు చేసిందన్నారు.ఇండియా కూటమి కేంద్రంలోఅధికారంలోకి వస్తే ఐదు న్యాయాలతో పాటు 25 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

======================